


కదిరి జీవిమాన్ సర్కిల్‌లో ఓ భవనంపై తొలగించని సిద్ధం హోర్డింగ్

పుట్టపర్తిలోని 1, 2 సచివాలయాల భవనం వద్ద తొలగించని వైసీపీ జెండా



వామ్మో.. అన్ని రోజులా!

అభ్యర్థుల్లో కలవరం



- ఆందోళనరేపుతున్న ఖర్చులు
- కూటమికి కలిసొచ్చే కాలం
- అధికార పార్టీకి చెమటలు
- యంత్రాంగానికి పరీక్ష

అందరూ ఎదురుచూస్తున్న ఎన్నికల కోడ్ వచ్చేసింది. రాజకీయ పార్టీల్లో వేడి పెరిగింది. ప్రధాన పార్టీలు తొలి విడతలోనే ఎన్నికలు ఉంటాయని భావించినా నాలుగో విడత మే 13న పోలింగ్ ఉంటుందని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఎన్నికల షెడ్యూల్, పోలింగ్‌కు మధ్య 58 రోజులు గడువు ఉంటుందని తెలిసి ప్రధాన రాజకీయ పార్టీల నేతలు ముఖ్యంగా బరిలో ఉన్న అభ్యర్థులు తల్లడిల్లిపోతున్నారు. వామ్మో అన్ని రోజులు ఎలా జన సమూహాన్ని ముందుకు నడపాలన్న ఆలోచనలో పడ్డారు. అధికార వర్గాలు కూడా ఇన్ని రోజులు వ్యవధి ఉంటే ఎలా అని మథన పడుతున్నాయి. వేసవిలో ఎన్నికలు నిర్వహిస్తుండడం, వ్యవధి ఎక్కువగా ఉండటంతో ఒకింత ఆందోళనకు లోనవుతున్నారు. ఇప్పటికే అధికార పార్టీ అభ్యర్థులను ఖరారు చేసింది. అన్నిరోజులపాటు ఎన్నికల ఖర్చులు భరించలేమని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.

\- హిందూపురం

ఖర్చులపై ఆందోళన



ఎన్నికల వేళ ప్రధాన రాజకీయ పార్టీల ఖర్చులను అంచనా వేయలేం. ఎన్నికల సంఘానికి కాకి లెక్కలు చూపి నా.. వాస్తవానికి లక్షల్లోనే ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ విషయం బహిరంగ రహస్యమే. ఒక పంచాయతీ వార్డుకానీ, మునిసిపల్ కౌన్సిలర్‌గానీ ప్రచారం చేయాలంటే రోజుకు లక్ష దాకా వ్యయం అవుతోంది. అలాంటిది ఎమ్మెల్యేలు, ఎంపీ అభ్యర్థులు ఇన్ని రోజుల పాటు ప్రచారం చేయాలంటే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. ప్రచార భారాన్ని భరించాలంటే కోట్లలో ఖర్చు చేయాల్సి ఉంటుంది. పోలింగ్ సమయం ఎక్కువగా ఉండటంతో ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. దీంతో పోటీలో ఉన్న అభ్యర్థులు హడలెత్తిపోతున్నారు.

అధికార పార్టీకి చెమటలు

ఎన్నికలకు సుమారు రెండు నెలల సమయం ఉండటంతో అధికార పార్టీ నాయకుల్లో గుబులు మొదలైంది. ఓవైపు ఆ పార్టీలో అసమ్మతి సెగలు, వర్గపోరు తీవ్రంగా ఉంది. ఇది ఆది నుంచి అలాగే ఉంది. ధర్మవరం మినహా మిగిలిన ఆరు నియోజకవర్గాల్లోనూ వర్గపోరు తారస్థాయికి చేరిందని చెప్పవచ్చు. దీంతో సొంత పార్టీ నాయకులు మరింత దూరం అవుతారని పోటీలో ఉన్న అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. దీనికితోడు గతేడాది వర్షాలు రాకపోవడంతో చెరువుల్లో నీరు లేక నెర్రెలు పారుతున్నాయి. తాగునీటి సమస్య పల్లెల్లో ఇప్పుడిప్పుడే మొదలైంది. మరో నెల రోజుల్లో తారస్థాయికి చేరుకుంటుంది. వ్యవసాయానికి రాత్రిపూట విద్యుత్ సరఫరా ఇస్తున్నారు. సమయం కూడా తగ్గించారు. ఇప్పటికే అధికార పార్టీ నాయకులు అభివృద్ధి పనులు చేయక ప్రజలకు మొహం చూపడానికి జంకుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మరో నెలరోజుల తరువాత ప్రజల్లోకి వెళ్తే పరిస్థితి ఏరకంగా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. వైసీపీ అధికారంలోకి రాకముందు గొప్పగా హామీలు ఇచ్చారు. వాటిపై ప్రశ్నించడానికి ఆస్కారం ఉంటుంది. ఈ పరిస్థితుల్లో అధికార పార్టీ అభ్యర్థులు ప్రజల్లోకి వెళ్లడానికి జంకుతున్నారు.

అధికారులకు పరీక్ష

ఎన్నికల రణరంగంలో కీలకంగా వ్యవహరించే రెవెన్యూ, పోలీసు, ఉపాధ్యాయులు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇది పరీక్షా కాలమని చెప్పవచ్చు. ఎఫ్ఎస్‌టీ, ఎంసీసీ, కంట్రోల్ రూమ్, అధికారులు, సిబ్బంది, బీఎల్‌ఓలు, రెండునెలలపాటు విధులు నిర్వహించాల్సి ఉంది. సెక్టోరల్ అధికారులు, ఈఆర్‌ఓలు, తహసీల్దార్లు చేసిన పనే పలుమార్లు పరీక్షించుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. ఉపాధాయయులు ఎన్నికల విధులతోపాటు ఓవైపు బోధన, మరోవైపు పరీక్ష, స్పాట్ వాల్యూషన్ చేయాల్సి ఉంటుంది.

కూటమికి కలిసొచ్చే కాలం



టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి సుమారు రెండునెలల కాలం కలిసి వచ్చే అవకాశం ఉంది. ఇప్పుడిప్పుడే మూడు పార్టీల మధ్య పొత్తు కుదిరి అభ్యర్థులను ప్రకటించాయి. బీజేపీ కూడా త్వరలోనే తమ పార్టీ అభ్యర్థులను ప్రకటించనుంది. కొన్నిచోట్ల టిక్కెట్లు రాకపోవడంతో ఈ మూడు పార్టీల్లో కొంత మంది నేతలు అలకబూనారు. సమయం ఉండటంతో వారి మధ్య సఖ్యత కూడుగట్టుకోవడంతోపాటు మూడు పార్టీల మధ్య సమన్వయానికి, కలిసి ప్రచారం చేసేందుకు ఈ సమయం ఎంతగానో ఉపయోగపడుతుంది. చిన్నచిన్న లోటుపాట్లు సరిచేసుకోవడానికి వీలుంటుంది. అధికార పార్టీ.. ప్రజా వ్యతిరేక విధానాలు ఎండగట్టడంతోపాటు టీడీపీ, జనసేన మేనిఫెస్టోలోని అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు మార్గం సుగమం అయింది. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లడానికి, బీసీ మేనిఫెస్టోతోపాటు నిరుద్యోగుల కోసం అమలు చేయనున్న వివిధ పథకాలను ఆ వర్గాలకు వివరించేందుకు తగిన సమయం ఉంటుంది. ప్రజాసమస్యలపై పోరాటం చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో మూడు పార్టీలు కలిసి పనిచేయడానికి వీలుగా ఎన్నికల ప్రకటన ఉండటం కలిసొచ్చే అంశం.

రంజాన్ వేళలు



	ఇఫ్తార్	సెహరీ
పుట్టపర్తి	6.33 సోమవారం (సాయంత్రం)	5.02 మంగళవారం (ఉదయం)
కదిరి	6.31 సోమవారం (సాయంత్రం)	5.09 మంగళవారం (ఉదయం)
ధర్మవరం	6.36 సోమవారం (సాయంత్రం)	5.06 మంగళవారం (ఉదయం)
హిందూపురం	6.34 సోమవారం (సాయంత్రం)	5.10 మంగళవారం (ఉదయం)
పెనుకొండ	6.32 సోమవారం (సాయంత్రం)	5.08 మంగళవారం (ఉదయం)

కోడ్ కూసినా..

అమలుకాని ఎన్నికల నియమావళి

- పలుచోట్ల వైసీపీ ప్రచార పోస్టర్లు యథాతథం
- వైఎస్సార్ విగ్రహానికి తొడగని ముసుగు
- అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు

పుట్టపర్తి రూరల్, మార్చి 17: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి 24 గంటలు గడిచినా.. అధికార యంత్రాంగం మేల్కోలేదు. ఎన్నికల నియమావళిని అమలు చేయడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారన్న విమర్శలు మూటగట్టుకుంటున్నారు. పలుచోట్ల వైసీపీ ప్రచార పోస్టర్లు, జెండాలను తొలగించడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు శనివారం షెడ్యూల్ విడుదల చేసింది. దీతో కోడ్ అమలులోకి వచ్చింది. 24 గంటల్లోగా ప్రభుత్వం కార్యాలయాలు, స్థలాల్లో ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, బోర్డులను తొలగించాల్సి ఉంది. నేతల విగ్రహాలకు ముసుగులు తొడగాల్సి ఉంది. కొన్నిప్రాంతాల్లో ఎన్నికల నిబంధనలు అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాకేంద్రం పుట్టపర్తిలోని 1, 2 సచివాలయాల వద్ద వైసీపీ జెండా రెపరెపలాడుతున్నా అధికారులు తొలగించకపోవడం శోచనీయం. జగరాజుపల్లి బస్టాండులో వైసీపీ సిద్ధం పోస్టర్, సూపర్ హాస్పిటల్, కప్పలబండ వద్ద తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకులకు వైసీపీ జెండా రంగులు తొలగించలేదు. వెంకటగారిపల్లి రేషన్‌షాపు వద్ద ముఖ్యమంత్రి జగన్ స్టిక్కర్‌ను అలాగే ఉంచారు. ధర్మవరం పట్టణంలో వైఎస్సార్ విగ్రహానికి ముసుగు వేయకపోవడం గమనర్హాం. కదిరి పట్టణంలో 26వ సచివాలయంలో పథకాలకు సంబంధించిన పోస్టర్లను ఇంతవరకు తొలగించలేదు.


ధర్మవరంలో ముసుగువేయని వైఎస్సార్ విగ్రహం



పుట్టపర్తి పరిధి జగరాజుపల్లి బస్టాండులో తొలగించని వైసీపీ సిద్ధం పోస్టర్


ఓబుళదేవర చెరువులోని ప్రధాన రహదారిలో రెపరెప లాడుతున్న వైసీపీ జెండా, భవనంపై ఆ పార్టీ బోర్డు


కదిరిలోని 26వ సచివాలయం ప్రహరీకి తొలగించని నవరత్నాల పోస్టర్లు

10 పరీక్షలకు వేళాయె..

115 కేంద్రాలు సిద్ధం

హాజరు కానున్న 27,555 మంది విద్యార్థులు

ఏర్పాట్లు పూర్తి


కొత్తచెరువు పరీక్షాకేంద్రంలో రోల్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

కొత్తచెరువు, మార్చి 17: జిల్లావ్యాప్తంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి నిర్వహించనున్నారు. ఈనెల 30వ తేదీ వరకు కొనసాగనున్నాయి. జిల్లాలో మొత్తం 115 పరీక్షాకేంద్రాలను సిద్ధం చేశారు. 27,555 మంది విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో బాలురు 15,020 మంది, బాలికలు 12,535 మంది ఉన్నారు. పరీక్షల పర్యవేక్షణ నిమిత్తం 115 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 115 మంది డిపార్టుమెంటల్ అధికారులు, 13 మంది అడిషనల్ డిపార్టుమెంటల్ అధికారులను నియమించారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు కొనసాగనున్నాయి. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు అరగంట ముందే చేరుకోవాల్సి ఉంది. ఏదైనా సమస్యతో 5 నిమిషాలు ఆలస్యమైతే పరీక్షా కేంద్రానికి అనుమతిస్తామని డీఈఓ మీనాక్షి తెలిపారు. ఇప్పటికే పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, గాలి, వెలుతురు, ఫ్యాన్లు, లైటింగ్ ఏర్పాటు చేశామన్నారు. కేంద్రాల వద్ద వైద్యసిబ్బందిని కూడా నియమించామన్నారు. సమస్యాత్మక పరీక్షాకేంద్రాల వద్ద సిట్టింగ్ స్క్వాడ్‌తో పర్యవేక్షిస్తామని వెల్లడించారు. పేపర్ లీక్ అయితే అది ఏ సెంటర్ నుంచి, ఏ విద్యార్థి నుంచి లీక్ అయిందో వెంటనే తెలుసుకునేందుకు కోడ్ సైతం ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు.

విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం

పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించింది. బస్సు సర్వీసులు తిరిగే రూట్లలో విద్యార్థులు తమ హాల్ టిక్కెట్ కండక్టర్‌కు చూపించి ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని డీఈఓ సూచించారు. ఇదివరకే ఆర్టీసీ అధికారులకు ప్రభుత్వం విద్యార్థుల ఉచిత ప్రయాణంపై ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.

పది పేపర్ లీక్ చేస్తే క్రిమినల్ చర్యలు : కలెక్టర్

పుట్టపర్తి, మార్చి 17: పదో తరగతి పరీక్షల ప్రశ్నపత్రాన్ని లీక్ చేస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు.. అధికారులను హెచ్చరించారు. కలెక్టర్ ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. తొలిసారి ప్రశ్నపత్రంలో యూనిక్ క్యూఆర్ కోడ్ నిక్షిప్తమై ఉంటుందనీ, లీక్ చేస్తే సులభంగా బయటపడుతుందన్నారు. అధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు.



పరీక్షలు పకడ్బందీగా నిర్వహిద్దాం

జిల్లా విద్యాశాఖాధికారి మీనాక్షి



కొత్తచెరువు, మార్చి 17: జిల్లావ్యాప్తంగా పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహిద్దామని జిల్లా విద్యాశాఖాధికారి మీనాక్షి పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ సభ్యులకు నియమ నిబంధనల గురించి ఆమె తెలిపారు. పొరబాట్లకు అవకాశం ఇవ్వరాదన్నారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు సమష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఐఈఓ రంగస్వామి, విద్యాశాఖ ఏడీ-1 నాగరాజు, ఏడీ-3 లాజర్, ఎంఈఓలు పాల్గొన్నారు.


పదో తరగతి స్క్వాడ్లకు విధివిదానాలను వివరిస్తున్న డీఈఓ మీనాక్షి

పరీక్షల విధులకు రాం.. రాం..



డీఈఓ కార్యాలయం



ఉపాధ్యాయుల విముఖత

గతేడాది రెమ్యూనరేషన్ నేటికీ అందని దుస్థితి

250 మందికి తప్పని ఎదురుచూపులు

ఈసారి హాజరయ్యేందుకు అయిష్టత

కొత్తచెరువు, మార్చి 17: జిల్లాలో పదో తరగతి పరీక్షల ఇన్విజిలేషన్, జవాబుపత్రాల మూల్యాంకనానికి ఉపాధ్యాయులు రాం.. రాం.. అంటున్నారు. రెమ్యూనరేషన్ చెల్లింపుల్లో తీవ్ర జాప్యమే ఇందుకు కారణం. గతేడాది పది పరీక్షల విధులకు హాజరైన వారిలో కొంతమందికి రెమ్యూనరేషన్ నేటికీ అందలేదు. దీంతో పరీక్షలు, మూల్యాంకన విధులకు ఉపాధ్యాయులు విముఖత చూపుతున్నారు. పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభంకానున్నాయి. పరీక్షల నిర్వహణ, అనంతరం ఇతర జిల్లాల నుంచి వచ్చిన జవాబుపత్రాల మూల్యాంకనం విధుల్లో ఉపాధ్యాయులు పాల్గొనాల్సి ఉంది. గత విద్యాసంవత్సరంలో జిల్లాలో పదో తరగతి పరీక్షల నిర్వహణ విధుల్లో దాదాపు 1400 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మూల్యాంకనంలో 680 మంది వరకు పాల్పంచుకున్నారు. ఇన్విజిలేటర్లకు రోజుకు రూ.40, మూల్యాంకనంలో పాల్గొంటే రూ.60, జవాబుపత్రాల మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయులకు పేపర్‌కు రూ.6 చొప్పున 40 పేపర్లకు రూ.240 ప్రోత్సాహకంతోపాటు డీఏ రూ.40 చెల్లించాల్సి ఉంది. గతేడాది మూల్యాంకనం, ఇన్విజిలేషన్‌లో పాల్గొన్న 250 మంది ఉపాధ్యాయులకు నేటికీ రెమ్యూనరేషన్ అందలేదని ఉపాధ్యాయ సంఘం నాయకులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు. గతేడాది నిర్వహించిన విధులకే డబ్బు ప్రభుత్వం అందించలేదు. దీంతో వారికి ఎదురుచూపులు తప్పట్లేదు. మళ్లీ ఏడాది పరీక్షలు వచ్చినా.. బకాయిలు మాత్రం అందలేదు. దీంతో ప్రస్తుతం విధులకు హాజరైతే రెమ్యూనరేషన్ ఇస్తుందో.. లేదో.. అంటూ ఉపాధ్యాయులు గుసగుసలాడుకుంటున్నారు. ఉపాధ్యాయులపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందనీ, ఇది మంచి పద్ధతి కాదని ఆ సంఘాల నాయకులు మండిపడుతున్నారు. ఈసారి అయిష్టంగానే పది పరీక్షల విధులకు హాజరవుతున్నట్లు ఉపాధ్యాయ వర్గాల ద్వారా తెలుస్తోంది.

ప్రభుత్వానికి బిల్లులు పంపాం: మీనాక్షి, డీఈఓ

2022-23లో పది పరీక్షల మూల్యాంకనానికి హాజరైన ఉపాధ్యాయుల రెమ్యూనరేషన్ కోసం ప్రభుత్వానికి నివేదిక పంపాం. గతంలో కొంతమంది ఉపాధ్యాయులకు బిల్లులు రాలేదన్న మాట వాస్తవం. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే ఉపాధ్యాయుల ఖాతాల్లో జమవుతాయి.

కరువు రైతుకు మోసం..!

రబీలో జిల్లా అంతటా దుర్భిక్షం..

- రొద్దం ఒక్కటే కరువు మండలమట..
- 31 మండలాలకు మొండిచేయి..
- ప్రభుత్వ ప్రకటనపై సర్వత్రా విస్మయం



పుట్టపర్తి, మార్చి17(ఆంధ్రజ్యోతి): వ్యవసాయమే జిల్లా ప్రజలకు ప్రధాన జీవనాధారం. ఖరీఫ్‌లో వర్షాభావం వెంటాడింది. రబీలో కూడా ఈశాన్య రుతుపవనాలు బలహీనపడడం మూలంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు తలెత్తాయి. భూగర్భ జలమట్టం పడిపోయి, పంటలు ఎండిపోయి చేతికందక రైతన్నకు అప్పులే మిగిలాయి. ఈనేపథ్యంలో జిల్లా అంతటా కరువుఛాయలు అలుముకున్నాయి. 2023-24 రబీ కరువు మండలాల ప్రకటనలో ప్రభుత్వం జిల్లా రైతును మళ్లీ మోసం చేసింది. రొద్దం మండలంలో మాత్రమే తీవ్ర కరువు ఉందంటూ శనివారం ఎన్నికల కోడ్ కూయక ముందు ప్రభుత్వం కరువు డ్రామాకు తెరలేపి, ఉత్తర్వులు విడుదల చేసింది. వాస్తవ పరిస్థితులను పక్కనబెట్టి, ఒక్క మండలాన్నే కరువు జాబితాలో ప్రకటించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో ఖరీఫ్‌లో ఏడు తీవ్ర, 14 పాక్షిక కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించింది. 11 మండలాలకు మొండిచేయి చూపింది. రబీలో ఒక్క మండలానికి మాత్రమే చోటు కల్పించి, 31 మండలాల రైతులకు అన్యాయం చేశారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకునే వైసీపీ పాలకులు.. అన్నదాతకే ద్రోహం చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు విఫలమయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా యంత్రాంగం సైతం క్షేత్రస్థాయిలో కరువు పరిస్థితులను పరిశీలించకుండా ప్రభుత్వం చెప్పినట్లు కంటితుడుపుగా నివేదికలు పంపడంతోనే రైతుకు అన్యాయం వాటిల్లుతోందన్న భావన నెలకొంది. కరువు మండలాల జాబితాలో చోటు లభిస్తే పంట రుణాల రీషెడ్యూల్, పంటనష్ట పరిహారం, తాగునీటికి నిధులు, అదనపు ఉపాధి పనిదినాల కల్పన తదితర కరువు సహాయక చర్యలకు అవకాశం ఉంటుంది. ఖరీఫ్‌లో జిల్లాలో కరువు మండలాలుగా ప్రకటించిన ప్రాంతాల్లో ఇదివరకు ఎలాంటి సహాయక చర్యలు చేపట్టకపోవడం శోచనీయం. తాజాగా రబీలో ఒకే మండలాన్ని తీవ్ర కరువు ప్రాంతంగా ప్రకటించిన ప్రభుత్వం తదుపరి సహాయక చర్యలు ఏమేరకు చేపడుతుందోనన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో అన్నదాతలు ఆశలు వదులుకున్నారు.



నేటి నుంచి ఇంటర్ స్పాట్

కొత్తచెరువు, మార్చి 17: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తొలిసారిగా ఇంటర్మీడియట్ జవాబు పత్రాల మూల్యాంకనం (స్పాట్ వాల్యూషన్) సోమవారం నుంచి నిర్వహించనున్నట్లు ఆర్ఐఓ సురేశ్‌బాబు ప్రకటనలో తెలిపారు. స్పాట్‌కు 500 మంది సిబ్బందిని నియమించామన్నారు. మూల్యాంకనానికి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

రాజకీయ పోస్టర్లు, హోర్డింగులు తొలగించండి

ఎన్నికల నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలి

వీసీలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి

పుట్టపర్తి, మార్చి 17: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున అనుమతి లేని రాజకీయ ప్రకటనలను వెంటనే తొలగించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా.. జిల్లా అధికారులను ఆదేశించారు. అమరావతి నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు పరచాలంటూ ఈసీ ఆదేశించారు. ఇంకా విధుల్లో చేరని ఎన్నికల అధికారులపై తక్షణమే క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. 24 గంటల్లోగా ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో, 48 గంటల్లోపు ప్రైవేటు స్థలాల్లో అనుమతిలేని రాజకీయ ప్రకటనలను తొలగించాలన్నారు. వలంటీర్లు.. రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో పాల్గొంటే సస్పెండ్ చేయాలంటూ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటికే రాజకీయ ప్రకటనలను తొలగించామన్నారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణపై ఆయా ఆర్వోలతో సమీక్ష నిర్వహించామన్నారు. క్షేత్రస్థాయిలో బ్యానర్లు, పోస్టర్లు, స్టిక్కర్లు తొలగించాలని ఆదేశించామన్నారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, డీఆర్వో కొండయ్య, పెనుకొండ సబ్‌కలెక్టర్ అపూర్వభరత్, నియోజకవర్గాల ఎన్నికల అధికారులు భాగ్యరేఖ, గౌరీశంకర్, వంశీకృష్ణ పాల్గొన్నారు.

ప్రజాగళం.. ప్రభంజనం


తొడగొడుతున్న యువతి..


పల్నాడు జిల్లా బొప్పూడి ప్రజాగళం సభకు హాజరైన జనం


ప్రజాగళం సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు, మోదీ, పవన్



ప్రజాగళం సభకు వస్తున్న అమరావతి మహిళలు






ప్రజాగళం సభలో మూడు పార్టీల అభిమానులు

జనం జనం ప్రభంజనం.. బొప్పూడి ప్రజాగళం జనసంద్రమైంది. ఆదివారం భానుడు భగభగ మండిస్తున్నా తగ్గేదిలేదన్నట్లుగా తరలివచ్చిన అశేష జనం హర్షాతిరేకాలతో బొప్పూడి సభా ప్రాంగణం దద్దరిల్లింది. బొప్పూడికి ఇటు చిలకలూరిపేట, అటు మార్టూరు వరకు 16వ నెంబరు జాతీయ రహదారి జనంతో నిండిపోయింది. యువకులు వృద్ధులు, మహిళలు పిల్లలు అన్న తేడా లేకుండా అన్ని వర్గాల వారు కూటమి జెండాలు చేబూని బొప్పూడి వైపు కదలిరావడంతో జాతీయ రహదారిపై జన సునామీ ఆవిష్కృతమైంది. చలో బొప్పూడి అంటూ కార్యకర్తలు, నేతలు, అభిమానులు ఒక ప్రవాహంలా తరలిరావడంతో మధ్యాహ్నం మూడు గంటలకే సభా ప్రాంగణం మొత్తం జనంతో కిటకిటలాడింది. జనసునామీని చూసిన అధినేతలు ఆనందపరవశులయ్యారు. మోదీ అయితే చంద్రబాబును ప్రత్యేకంగా అభినందించారు. బొప్పూడి వేదికగా త్రిమూర్తులైన ప్రధాని నరేంద్రమోదీ, టీడీపీ, జనసేన అధి నేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఎన్నికల శంఖారావం పూరించారు. అభివృద్ధి లేక అప్పులు.. దోపిడీ దాష్టీకాలు.. అవినీతి అప్రజాస్వామిక పాలనను అంతం పలకాలని నేతలు పిలిపిచ్చారు. జెండాలు వేరైనా అజెండా ఒకటేనని.. అభివృద్ధి, సంక్షేమం, ప్రజాస్వామ్య పరిరక్షణ కావాలంటే కూటమికి ఓటేసి ఆశలు, ఆకాంక్షలు, సాకారం చేసుకోవాలని సందేశమిచ్చారు. **- చిలకలూరిపేట**


ఉత్సాహంగా యువతులు..


జానపదుల నృత్యాలు..


బాబు,పవన్, పురంధేశ్వరి అభివాదం...


మోదీతో బాబు మాటామంతీ..


మహిళలు, కార్యకర్తల ఉత్సాహం..





అమ్మకానికి దేవుడి సేవలు..!


ఉభయదారులు ఉండగానే... గుట్టు చప్పుడు కాకుండా
ప్రజాగరుడ సేవ మాజీ చైర్మన్‌కు కేటాయింపు
వైసీపీ నాయకుడి సిఫార్సుతోనే...?

కదిరి, మార్చి 17: ఆధ్యాత్మిక చింతన, భక్తి భావంతో చేసే దేవుడి సేవల్లో కూడా రాజకీయం మొదలు పెట్టారు. పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా జరిగే వాహనసేవలకు ఉభయదారులు అనాదిగా ఉంటున్నారు. వందల సంవత్సరాల నుంచి వారసత్వంగా ఆ సేవలు వారి కుటుంబీకులే చేస్తున్నారు. అటువంటి సేవలు నేడు అమ్మకానికి పెట్టినట్లు భక్తులు వాపోతున్నారు. దేవుడి సేవలనే అమ్మకానికి పెట్టడం ఏంటని భక్తులు ప్రశ్నిస్తున్నారు. మూడో కంటికి తెలియకుండా స్వామి సేవను కేటాయించడంపై అనేక అనుమానాలు భక్తులు లేవనెత్తుతున్నారు. బ్రహ్మోత్సవాల్లో ప్రజాగరుడ సేవ ఒకటి. అత్యంత ప్రాశస్త్యం ఉంది. ఈసేవను వానవోలుకు చెందిన బంగారు ఆదిమూర్తప్పతోపాటు అయన కుటుంబీలు చేస్తున్నారు. అయితే అనివార్యకారణాలతో ఆయన వారసులు ఆ సేవను తాత్కలికంగా చేయలేమంటూ రాత పూర్వకంగా రెండు సంవత్సరాల కిందట రాసినట్లు తెలిసింది. ఆ తరువాత జరిగిన రెండు బ్రహ్మోత్సవాల్లో ఆలయం తరఫునే ఉభయదారులుగా చేస్తున్నారు. అయితే ఆ సేవను ఇటీవలే టెంపుల్ మాజీ ఛైర్మన్ కాంబోజీ రెడ్డెప్ప శెట్టికి కేటాయించినట్లు బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికల్లో వేశారు. విషయం తెలుసుకున్న వానవోలు వారసులు ఆలయ ఈఓ వద్దకు వచ్చి తామే సేవను కొనసాగిస్తామని చెప్పినా పట్టించుకోలేదని చెబుతున్నారు. ఈ సేవను దక్కించుకోవడానికి రాజకీయ సిఫార్సుతోపాటు మరి కొంతమంది లక్షలు రూపాయలు ధారపోసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అమ్మకానికి దేవుడి సేవలా అంటు భక్తులు చర్చించుకుంటున్నారు.

ఉభయదారులు ఉండగానే...

ప్రజాగరుడ సేవను చేసే ఉభయదారులు వానవోలు వారసులు ఇంకా ఉన్నారు. వారసుల్లో కొంతమంది మాత్రమే సేవను అనివార్య కారణాల వల్ల చేయలేమని రాసిచ్చారని, దాయాదులు ఉన్నామని మేము స్వామి వారి సేవ సేయడానికి సిద్ధంగా ఉన్నామని చెబుతున్నారు. తాము లిఖిత పూర్వకంగా రాసిచ్చినా ఈఓ పట్టించుకోలేదని వారు అంటున్నారు. ఈసేవ కోసం తాము కోర్టు వరకు అయినా వెళ్లడానికి సిద్ధమని చెబుతున్నారు. తమకు అనుకోని ఇబ్బందులు రావడం వల్ల స్వామి వారి సేవ చేయలేక పోయామని అంతమాత్రాన ఇతరులకు ఏలా కేటాయిస్తారని ప్రశ్నిస్తున్నారు.

గుట్టుచప్పుడు కాకుండా ప్రజాగరుడ సేవను కేటాయించడంపై ఈఓ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని భక్తులు అంటున్నారు.



2024 సంవత్సరంలో ప్రజాగరుడ సేవను రెడ్డెప్పశెట్టికి కేటాస్తూ ముద్రించిన పోస్టర్

గుట్టుచప్పుడు కాకుండా...

స్వామి వారి సేవలు కేటాయించే సమయంలో భక్తులకు తెలియజేయాల్సి ఉంది. దీనిపై విస్తృత ప్రచారం చేస్తే దేవుడి సేవ చేయడానికి ఎంతో మంది భక్తులు ముందుకు వచ్చే వారు. అలా కాకుండా ఆలయ ఈఓ ఇష్టారాజ్యంగా వ్యవహరించారని భక్తులు అంటున్నారు. గుట్టుచప్పుడు కాకుండా ప్రజాగరుడ సేవను టెంపుల్ మాజీ చైర్మన్‌కు కేటాయించడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. దేవుడి సేవను అధికారులు అమ్ముకున్నారని ఆరోపిస్తున్నారు. లక్షల్లో చేతులు మారయని అంటున్నారు. రెండు సంవత్సరాల నుంచి ఆలయం నిర్వహించి ఇప్పుడు ఎవరికీ తెలియకుండా స్వామి వారి సేవను కేటాయించడంలో మతలబు ఏంటని ప్రశ్నిస్తున్నారు. స్వామి వారి ఆలయ అభివృద్ధికిపాటు పడే వారికి ఆ సేవను కేటాయించి ఉంటే బాగుండేదని భక్తులు చెబుతున్నారు.

రాజకీయ సిఫార్సుతోనే జరిగిందా ?

ప్రజాగరుడ సేవ ఉభయదారుల మార్పు రాజకీయ సిఫార్సుతోనే జరిగిందా అని భక్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ప్రజాగరుడ సేవను దక్కించుకున్న టెంపుల్ మాజీ ఛైర్మన్ రెడ్డెప్పశెట్టి వైసీపీతో సన్నిహితంగా ఉన్నారు. ఈ కారణంగానే ఆయనకు టెంపుల్ ఛైర్మన్‌గా అవకాశం ఇచ్చారని భక్తులు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రజాగరుడ సేవను కేటాయించడానికి కూడా ఇటీవల వైసీపీలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ఓ నియోజవర్గస్థాయి నాయకుడి సిఫార్సు మేరకు ఆ సేవ కేటాయించినట్లు భక్తులు ఆరోపిస్తున్నారు. దీంతో అధికారులు తమకు అందినంత పుచ్చుకొని ఈ సేవను కేటాయించినట్లు భక్తులు చెబుతున్నారు.

దేవస్థానాల్లో వారసత్వ హక్కు రద్దు

దేవస్థానాల్లో వారసత్వ హక్కు రద్దు చేశారు. 1987లో ఏపీస్టేట్‌లో దేవదాయ చట్టం ద్వారా దేవస్థానాల్లోని అన్ని వారసత్వ హక్కులను రద్దు చేశారు. ఈ మేరకు ప్రజాగరుడ సేవను చేయలేమని ఉభయదారులు స్వచ్ఛందంగా విరమించుకున్నారు. దీంతో ఈ సేవను 2024 సంవత్సరంలో చేసేందుకు టెంపుల్ మాజీ ఛైర్మన్ కాంబోజీ రెడ్డెప్పశెట్టికి కేటాయించాం. 20 సంవత్సరాలుగా దసరా ఉత్సవాల్లో భక్తులకు ఉచిత ప్రసాద వితరణ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఈ సంవత్సరం అవకాశం ఇచ్చాం. స్వామివారి సేవలు కేటాయించడం ఈఓ ఇష్టం.

- శ్రీనివాస రెడ్డి, కార్యనిర్వహణాధికారి,
ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, కదిరి

ప్రశాంతంగా గ్రూప్-1 పరీక్ష


పరీక్షా కేంద్రం వద్ద రూమ్ నంబర్లను చూసుకుంటున్న అభ్యర్థులు


అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

అనంతపురం టౌన్, మార్చి 17: జిల్లాలో గ్రూప్-1 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. 33 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అభ్యర్థులను పరిశీలించి కేంద్రాల్లోకి అనుమతించారు. నిముషం ఆలస్యమైనా నో ఎంట్రీ నిబంధన ఉండడంతో అభ్యర్థులు అరగంట ముందే కేంద్రాల వద్దకు చేరుకోవడం కనిపించింది. మరోవైపు పరీక్షా కేంద్రాలను పలువురు డీఎస్పీలు. జిల్లా అధికారులు తనిఖీ చేశారు. కాగా గ్రూప్-1 పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు కలెక్టర్ గౌతమి ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనతో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు జరిగిన పరీక్షకు 11, 597మందికి గాను 7,542మంది అభ్యర్థులు హాజరయ్యారన్నారు. 4,055 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు జరిగిన పరీక్షకు 7, 459మంది అభ్యర్థులు హాజరుకాగా 4,138 మంది గైర్హాజరు అయ్యారని కలెక్టరు వెల్లడించారు. ఉదయం 65.03శాతం, మధ్యాహ్నం 64.32శాతం అభ్యర్థులు హాజరయ్యారన్నారు.

రథం తయారీలో స్వాహాకు స్కెచ్?

సోషల్ మీడియాలో వైరల్

అనంతపురం, మార్చి17 (ఆంధ్రజ్యోతి): ఉరవకొండ మడలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహ స్వామి ఆలయ రథం తయారీలో స్వాహా పర్వానికి ఓ మాజీ ప్రజాప్రతినిధి తెరలేపినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయం ఆదివారం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. రెండేళ్ల నుంచి రథం తయారీ అంశం నడుస్తూ ఉంది. గతంలో రూ.1.70కోట్ల అంచనాతో రథం తయారీకి ప్రతిపాదనలు పంపారు. భక్తుల నుంచి విరాళాల సేకరణ ఆలస్యం కావడంతో రథం తయారీ ఆగిపోయింది. గతేడాది ఉత్సవాల సందర్భంగా స్వామి రథం కుప్పకూలి ధ్వంసమైంది. అధికారులు అప్పట్లో తాత్కాలిక రథంతో ఉత్సవాలు నిర్వహించారు. రానున్న మే నెలలో రథోత్సవం ఉన్నందున అప్పటికి రథం తయారయ్యేది ప్రశ్నార్థకమే. అధికారులు మాత్రం హడావుడిగా ఈనెల 27వ తేదీన రథం తయారీ పనులు ప్రారంభించారు. రూ.2.30 కోట్ల అంచనాతో పనులకు శ్రీకారం చుట్టారు. అందులో దేవస్థానం నిధులు రూ.1.35 కోట్లు, భక్తుల నుంచి సేకరించిన విరాళాల సొమ్ము రూ.98లక్షలతో కలిపి రూ.2.30కోట్లు అంచనాలు సిద్ధం చేశారు. నిధులను స్వాహా చేసేందుకు అధికారులు, అధికార పార్టీ నాయకులు స్కెచ్ వేసినట్లు తెలుస్తోంది. ఆ టెండర్‌ను అనంతపురానికి చెందిన కాంట్రాక్టర్ దక్కించుకున్నాడు. ఆ కాంట్రాక్టర్ స్థానిక ఆచారులతో రూ.1.38 కోట్లతో రథం తయారు చేసేలా అగ్రిమెంట్ కుదుర్చుకున్నట్లు కొన్నిపత్రాల ఫొటోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. టెండర్ వేయడానికి సెక్యూరిటీ డిపాజిట్ కూడా ఆచారులే చెల్లించినట్లు సమాచారం. ఈ లెక్కన దాదాపు రూ.కోటి ప్రధాన కాంట్రాక్టర్‌కు మిగలనున్నట్లు చర్చ సాగుతోంది. దీనిపై ఆలయ ఈఓ విజయ్‌కుమార్‌ను అడగ్గా.. అక్రమాల ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. సోషల్ మీడియాలో వచ్చినవన్నీ అవాస్తవాలేనన్నారు. రూ.1.78 కోట్లకు కాంట్రాక్టరుకు టెండరు అప్పగించామన్నారు.

జడ్పీ డిప్యూటీ సీఈఓగా రమణారెడ్డి

అనంతపురం విద్య, మార్చి 17: జిల్లాపరిషత్ డిప్యూటీ సీఈఓగా రమణారెడ్డి నియమితులయ్యారు. ఇక్కడ జడ్పీ డిప్యూటీ సీఈఓగా పనిచేస్తున్న లలితాబాయిపై గతంలో అనేక ఆరోపణలు రావడం, జడ్పీపాలక వర్గం ఆమెను సరెండర్ చేయాలంటూ ఇటీవల స్టాండింగ్ కమిటీ సమావేశం నుంచి వాకౌట్ చేశారు. రోడ్డుపైకి వచ్చి జడ్పీ సీఈఓ, డిప్యూటీ సీఈఓకు వ్యతిరేకంగా జడ్పీ ఛైర్‌పర్సన్, జడ్పీటీసీలు నినాదాలు చేశారు. ఆమెపై చర్యలు తీసుకోకుంటే జడ్పీ స్టాండింగ్ కమిటీకి, సర్వసభ్య సమావేశానికి కూడా హాజరు కాబోమంటూ హెచ్చరించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు జడ్పీలో స్టాండింగ్ కమిటీ సమావేశం కూడా నిర్వహించలేదు. ఈనేపథ్యంలో ఎట్టకేలకు జడ్పీ డిప్యూటీ సీఈఓగా డ్వామాలో జిల్లా విజిలెన్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న రమణారెడ్డిని నియమించారు. అదేవిధంగా లలితా బాయిని గుంతకల్లు డీఎల్‌డీఓగా నియమించారు. ఇద్దరిని డిప్యూటేషన్ బేసిస్‌పై నియమించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఈనెల 12న ఉత్తర్వులు జారీచేశారు. అయితే ఆ ఉత్తర్వులు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. రమణారెడ్డికి గతంలో కూడా డిప్యూటీ సీఈఓగా కొంతకాలం పనిచేసిన అనుభవం ఉంది.

నేటి నుంచి ఒంటిపూట బడులు

అనంతపురం విద్య, మార్చి 17: పాఠశాలలకు సోమవారం నుంచి మార్నింగ్ స్కూల్స్ నిర్వహించనున్నారు. మండుతున్న ఎండలు, వడగాలుల నేపథ్యంలో విద్యాశాఖ ఒంటిపూట బడులు నిర్వహించనుంది. ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నారు. ఏప్రిల్ 23వ తేదీ వరకు మార్నింగ్ స్కూల్స్ ఉండనున్నాయి. పదో తరగతి పరీక్షలు జరిగే కేంద్రాలున్న స్కూళ్లలో మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్కూళ్ల నిర్వహణ ఉంటుంది.

రాజీనామా చేయండి.. ప్రచారంలో పాల్గొనండి..

మీ ఉద్యోగాలకు ఢోకాలేదు: వలంటీర్లకు వైసీపీ నేతల భరోసా

బొమ్మనహాళ్, మార్చి 17: 'వైసీపీ అధికారంలోకి వచ్చేందుకు ప్రచార కార్యక్రమంలో చురుకుగా పాల్గొనండి.. మీపై పత్రికల్లో వార్తలు వచ్చి అధికారులు మందలిస్తే రాజీనామాలు చేస్తున్నామని నామమాత్రపు పత్రాలు ఇవ్వండి.. మీ రాజీనామాలు ఆమోదం కాకుండా మీ ఉద్యోగానికి ఢోకా లేకుండా అధికారులతో మేము మాట్లాడుకుంటాం..' అని వైసీపీకి చెందిన కొందరు ముఖ్యనాయకులు వలంటీర్లకు హుకుం జారీచేసినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు వైసీపీ ప్రచార కార్యక్రమాలలో కొందరు వలంటీర్లు పాల్గొంటుండడంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు వస్తుండడంపై ఆ పార్టీకి చెందిన కొందరు నాయకులు ఈ విధంగా చెప్పినట్లు సమాచారం. నిబంధనలను ఏమాత్రం పట్టించుకోకుండా వైసీపీ సేవలో కొందరు వలంటీర్లు మునిగి తేలుతున్నారు. బొమ్మనహాళ్ మండలంలోని కొన్ని గ్రామాల్లో వలంటీర్లు బరి తెగించి వైసీపీ కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. వలంటీర్ల ప్రచారంలో పాల్గొంటున్నా చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

టీడీపీతోనే ప్రజాసంక్షేమం

- ఇంటింటి ప్రచారంలో కందికుంట యశోదాదేవి



ఇంటింటా ప్రచారం చేస్తున్న కందికుంట యశోదాదేవి తదితరులు

కదిరి, మార్చి 17: ప్రజాసంక్షేమం టీడీపీతోనే సాధ్యమని ఆ పార్టీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట యశోదాదేవి పేర్కొన్నారు. పట్టణంలోని నిజాంవలీ కాలనీలో గల 15వ వార్డులో ఆదివారం ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. ఈసందర్భంగా ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్‌కు సంబంధించిన కరపత్రాలు పంచుతూ వాటి గురించి వివరించారు. ఈ పథకాల వల్ల అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. చంద్రబాబు సీఎం అయితే ఆ పథకాలన్నీ అమలవుతాయన్నారు. ఆయనతోనే ప్రజా సంక్షేమం సాధ్యమని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ 15వార్డు ఇన్‌చార్జి హైదర్‌వలీ, కౌన్సిలర్లు మహబూబ్ బాషా, అల్లాముస్తఫా, నాయకులు పర్వీన్‌బాను, షేక్ సురియాభాను, షేక్ బాబ్‌జాన్, డైమండ్ ఇర్ఫాన్, మహమ్మద్‌అలీ, సీఎండి ఇస్మాయిల్, విశ్వనాథ్, సీపీ ఫారూక్, కుటాగుళ్ల శంకర్, ఏటీ నాగప్ప, మేకల రమణ, జావీద్, నాసిర్, గోపాల్, రాజశేఖర్, కొమ్మినేని కల్పనాచౌదరి, అరుణ, పీట్ల రమణమ్మ, గంగరత్నమ్మ, ఫరీదా, ఐటీడీపీ మన్సూర్, జునైద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాల్లో పల్లె సింధూర పర్యటన

కొత్తచెరువు, మార్చి 17: పుట్టపర్తి నియోజకవర్గం టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి పల్లెసింధూరారెడ్డి కొత్తచెరువు మండలంలో సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా పర్యటించనున్నట్లు టీడీపీ నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని నాగిరెడ్డిపల్లి, ఇరగంపల్లి పంచాయతీలలో ఆమె పర్యటిస్తారన్నారు. మధ్యాహ్నం 2గంటల నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభమవుతుందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని వారు కోరారు.

పలుచోట్ల పల్లె..

నల్లమాడ: మండలంలోని వంకరకుంట, రెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో సోమవారం మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ షైలే శివశంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన ఇంటింటా తిరుగుతూ సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించనున్నట్లు చెప్పారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.

మహిళా ఉద్యోగులకు ఘన సన్మానం



మహిళా ఉద్యోగులను, సీనియర్ సిటిజన్లను సన్మానించిన దృశ్యం

కదిరిఅర్బన్, మార్చి 17: పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయ బలిజ సేవాసంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆసంఘం కార్యాలయంలో మహిళా ఉద్యోగులకు, సీనియర్ సిటిజన్లుకు ఘనంగా సన్మానం జరిగింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు సంఘం అధ్యక్షుడు రమేష్ తెలిపారు. మహిళా ఉపాధ్యాయులు కృష్ణవేణి, శ్రీవాణి, ప్రసన్నలక్ష్మి, కండెక్టర్ జయలక్ష్మి, సీనియర్ సిటిజన్లు రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ అశ్వర్థనారాయణ, రిటైర్డ్ ఉపాధ్యాయులు ఈశ్వరయ్య, పిడుగు నరసింహులు తదితరులను పూలమాలలు, శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాసులు, బైరిశెట్టి, రమేష్‌బాబు, కుటాల లక్ష్మణ్, చంద్రమోహన్ పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి మారుపూజ



ప్రత్యేక అలంకరణలో పెద్దమ్మతల్లి

ముదిగుబ్బ, మార్చి17: మండల కేంద్రంలోని పాతవూరులో వెలిసిన గ్రామదేవత పెద్దమ్మతల్లికి ఆదివారం మారుపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శివరాత్రి జాతర తరువాత వచ్చే ఆదివారం మారు పూజ చేయడం ఆనవాయితీగా వస్తోందని పూజారి చిన్న కొండన్న తెలిపారు. ఈ సందర్భంగా తెల్లవారుజామునే అమ్మవారి మూలవిరాట్‌కు వెండి ఆభరణాలు, బంతిపూలతో అలంకరించి, ప్రత్యేకపూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి జ్యోతులు, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

సైనిక్ పాఠశాలకు విద్యార్థుల ఎంపిక



సైనిక్ పాఠశాలకు ఎంపికైన విద్యార్థులతో టీచర్లు

ఓబుళదేవరచెరువు, మార్చి 17: మండలకేంద్రంలోని జ్ఞానసాయి విద్యానికేతన్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు కలికిరిలోని సైనిక పాఠశాల ప్రవేశానికి అర్హత సాధించారని కరెస్పాండెంట్ క్రిష్ణమోహన్‌రెడ్డి ఆదివారం తెలిపారు. పాఠశాలకు చెందిన 12మంది విద్యార్థులు సైనిక్ పాఠశాల ప్రవేశానికి పరీక్షలు రాయగా 10మంది అర్హత సాధించినట్లు చెప్పారు. అర్హత సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

అంతర్జాతీయ క్షేత్రంలో అద్భుతమూర్తి

పుట్టపర్తి, మార్చి 17: అంతర్జాతీయ క్షేత్రంలో అద్భుతమూర్తి అంటూ ఆదిలాబాద్ భక్తులు చేపట్టిన సంగీత నృత్యం సందర్శకులను అలరింపచేసింది. ఆదివారం సాయంత్రం సాయికుల్వంతు మందిరంలో ఉమ్మడి ఆదిలాబాద్ భక్తులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సత్యసాయిబోధనలు, ప్రేమతత్వం ఎందరికో శాంతిజీవనం ప్రసాదించిందన్నారు. భక్తి పాటల ఆలాపన అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



సాంస్కృతిక కార్యక్రమాల్లోని ఓ దృశ్యం

ముచ్చురామిలో దాహం.. దాహం

- తాగునీటి ఎద్దడితో ఇబ్బంది పడుతున్న గ్రామస్థులు
- ట్యాంకర్‌తో నీటిని కొనుగోలు చేస్తున్నవైనం
- పట్టించుకోని అధికారులు





ట్యాంకర్ నుంచి నీటిని పట్టుకుంటున్న గ్రామస్థులు

ధర్మవరంరూరల్, మార్చి17: మండలంలోని ముచ్చురామి గ్రామంలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. గుక్కెడు నీటి కోసం గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చేసేదిలేక ట్యాంకర్‌తో నీటిని కొనుగోలు చేస్తున్నారు. గ్రామంలో ని తాగునీటి బోరులో నీరు అడుగంటింది. ప్రస్తుతం అరకొర నీరు వస్తున్నాయి. అవి కొన్ని ప్రాంతాలకే సరిపోతుండడంతో సమస్య తలెత్తింది. అసలే వేసవి కాలం.. దీనికి తోడు నీటి సమస్య నెలకొనడంతో గ్రామస్థులు పడుతున్న ఇబ్బందులు అన్నీ.. ఇన్నీ కావు. సమస్యపై సంబంధితాధికారులకు పలు మార్లు విన్నవించినా ఫలితం లేకపోయిందని పలువురు వాపోతున్నారు. చేసేదిలేక రూ.1500లు చెల్లించి ధర్మవరం పట్టణం నుంచి ట్యాంకర్‌తో నీటిని తెప్పించి పట్టుకుంటున్నామని వాపోతున్నారు. ప్రతి రెండు రోజులకొకసారి గ్రామస్థులంతా చందాలు వేసుకుని ట్యాంకర్ ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నామని చెబుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు కలిగించకుండా చర్యలు తీసుకోవాలని చెబుతున్నా అవి మాటలకే పరిమితమయ్యాయని గ్రామస్థులు మండిపడుతున్నారు. నీరు లేక పశువులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని, దీంతో పశువులను అమ్ముకోవాల్సి వస్తోందని గ్రామరైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి కష్టాలు తీర్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే బెదిరించి వైసీపీ కండువాలు వేశారు..



టీడీపీ కార్యకర్తలకు వైసీపీ కండువాలు వేసిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



పల్లె నివాసంలో తిరిగి టీడీపీ కండువాలు వేసుకున్న కార్యకర్తలు

- మరాల గ్రామస్థులు
- ప్రాణమున్నంతవరకు టీడీపీలోనే ఉంటామని వెల్లడి

బుక్కపట్నం, మార్చి 17: పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సంక్షేమపథకాలు ఆపేస్తామని బెదిరించి తమకు బలవంతంగా వైసీపీ కండువాలు వేశారని మండలంలోని మరాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు వాపోయారు. ఎమ్మెల్యే ఆదివారం మరాల గ్రామానికి వచ్చారని, ఈసందర్భంగా సంక్షేమపథకాలు ఇస్తామంటూ సభకు పిలిపించి తమకు వైసీపీ కండువాలు వేశారని టీడీపీ కార్యకర్తలు చంద్ర, సూరి, జీవనాయక్, రాజేష్, నాగేంద్ర, మనీష్, చంద్ర,పెద్దినాయక్, సేవానాయక్, వినోద్, చంద్ర, సాయి, రామానాయక్, బాలానాయక్, లక్ష్మీనాయక్, రవినాయక్ తెలిపారు. ఎమ్మెల్యే తమగ్రామానికి వచ్చి, మమ్మల్ని బెదిరించి వైసీపీ కండువాలు వేశారన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి తమకు దైవసమానులన్నారు. తాము టీడీపీని వీడే ప్రసక్తే లేదన్నారు. అనంతరం పుట్టపర్తిలోని మాజీమంత్రి పల్లె నివాసానికి వచ్చి టీడీపీ కండువాలు వేసుకుని పార్టీపై ఉన్న అభిమానాన్ని చాటి చెప్పారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా, పల్లె సింధూరారెడ్డిని ఎమ్మెల్యేగా చేసుకుంటామని పేర్కొన్నారు. తమ ప్రాణమున్నంతవరకు టీడీపీని వదిలేది లేదన్నారు. అనంతరం పల్లె మాట్లాడుతూ బెదిరించి వైసీపీ కండువాలు వేస్తే, తమ కార్యకర్తలే తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కార్యకర్తలు ప్రతిఘటించాలని తెలిపారు.

ఎన్నికల కోడ్ అమలులో అధికారులు నిమగ్నం



కొక్కంటి క్రాస్‌లో పార్టీ జెండాలను తొలగిస్తున్న ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శి



గాండ్లపెంట ప్రధాన రహదారిలో ఫ్లెక్సీలను తొలగిస్తున్న దృశ్యం

తనకల్లు, మార్చి 17: ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో మండల అధికారులు ఎన్నికల నియమాలు అమలు చేయడంలో నిమగ్నయ్యారు. ఆదివారం సెలవు దినం అయినప్పటికీ ఎంపీడీఓ పూల నరసింహులు, పంచాయతీ కార్యదర్శులు ఆయాగ్రామాల్లో ఉన్న వివిధ పార్టీల జెండాలను, హోర్డింగ్ బోర్డులను, ఫ్లెక్సీలను, గోడలపై పోస్టర్లను తొలగించే పనుల్లో నిమగ్నమయ్యారు. ఎక్కడైనా గోడలపై రాతలున్నా, జెండాలు, హోర్డింగ్‌లు ఉన్నా తొలగించడానికి ప్రయత్నాలు చేస్తామని ఎంపీడీఓ పేర్కొన్నారు.

పోస్టర్లు, ఫ్లెక్సీల తొలగింపు

గాండ్లపెంట: మండలకేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో వివిధ పార్టీల జెండాలు, పోస్టర్లు, ఫ్లెక్సీలను ఆదివారం తొలగించారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన సందర్భంగా తహసీల్దార్ శ్రావణి ఆదేశాల మేరకు రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పోస్టర్లను, పార్టీ జెండాలను, ఫ్లెక్సీలను తొలగించారు.

నల్లమాడ: ఎన్నికల కోడ్ ప్రకటించడంతో మండలంలోని ఎన్టీఆర్, వైఎస్ఆర్ విగ్రహాలకు ముసుగులు వేశారు. అలాగే వివిధ పార్టీలు ఏర్పాటు చేసిన జెండాలు, ఫెక్సీలు, బోర్డింగులు, ఫ్లెక్సీలను అధికారులు తొలగించారు. ఎన్నికల కోడ్‌ను ఎవరూ అతిక్రమించకూడదని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు.

ఎన్నికల కోడ్ అమలులో నిర్లక్ష్యం తగదు: జేసీ

చిలమత్తూరు, మార్చి 17: ఎన్నికల కోడ్ అమలులో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఆయన ఆదివారం మండలంలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాల యాలను, ప్రభుత్వాసుపత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేసీ అన్ని కార్యా లయాల్లోకి వెళ్లి ఎక్కడైనా రాజకీయ పార్టీల నాయకుల ఫొటోలు, చిత్రాలు ఉన్నాయా? అని ఆరాతీశారు. ఉంటే వాటిని వెంటనే తొలగించాలన్నారు. కోడ్ అమల్లోకి రావడంతో ఎక్కడ కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి రాజకీయ నాయకుల ఫోటోలు ఉంటే వాటిపై స్టిక్కరింగ్ వేయాలన్నారు. ఎక్కడా కోడ్ ఉల్లంఘన జరగరాదన్నారు. అధికారులందురూ ఎన్నికలు ముగిసే వరకు అందుబాటులో ఉండాలన్నారు. సెలవు రోజుల్లో సైతం ప్రభుత్వ కార్యాలయాలు తెరవాలన్నారు. ఎక్కడైనా రాజకీయ పార్టీల హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు ఉంటే వెంటనే తొలగించండని ఆదేశాలు ఇచ్చారు. కోడ్‌కు విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా చర్యలు తీసుకుంటమని హెచ్చరించారు.

ఆదివారం.. విధులకు డుమ్మా

- కొత్తచెరువు సీహెచ్‌సీలో వైద్యుల నిర్లక్ష్యం
- ఇబ్బంది పడుతున్న రోగులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

కొత్తచెరువు, మార్చి 17: మండల కేంద్రంలోని (సీహెచ్‌సీ) సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు ఆదివారం రాగానే విధులకు హాజరు కావడం లేదు. దీంతో అక్కడికి వచ్చిన రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఆదివారం చాలా మంది రోగులు ఆస్పత్రికి వెళ్లి వైద్యులు లేనిది చూసి ఊసూరుమంటూ వెనుదిరుగుతున్నారు. ఆస్పత్రిలో నిత్యం వైద్యులు అందుబాటులో ఉండాలి. ఇక్కడ ఆ పరిస్థితి లేదు. ఇద్దరు ఏఎన్ఎంలు మాత్రమే ఉన్నారు. వారు కూడా లేకపోతే ఆస్పత్రి తలుపులు తెరిచేవారు కూడా ఉండరని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆదివారం అనారోగ్యంతో బాధపడుతున్న బిడ్డను పిలుచుకుని ఓ తల్లి వైద్యసేవల కోసం సీహెచ్‌సీకి వచ్చింది. సమయానికి వైద్యులు ఎవరూ అక్కడ లేరు. వస్తారేమోనని ఆమె గంటల తరబడి వేచి చూసింది. చివరికి ఎవరూ రాకపోవడంతో చేసేదిలేక బిడ్డను పిలుచుకుని వెనక్కి వెళ్లిపోయింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో ఉండాలి. ఈ సీహెచ్‌సీలో అలాంటిదేదీ కనబడడం లేదు. మండలంలో ఎవరికైనా ఏవైనా ప్రమాదాలు, అనుకోని ఘటనలు జరిగితే ప్రథమ చికిత్స కోసం 108 సిబ్బంది ఈ ఆస్పత్రికే తీసుకొస్తుంటారు. ఇక్కడ సరిగా వైద్యులు అందుబాటులో ఉండకపోవడంతో ధర్మవరం ,పెనుకొండకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని పలువురు వాపోతున్నారు. ఆరోగ్య కేంద్రాలను ఉన్నతాధికారులు పర్యవేక్షించకపోవడంతోనే వైద్యులు, సిబ్బంది ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని స్థానిక ప్రజలు, రోగులు వాపోతున్నారు. మండలంలోని 14 గ్రామపంచాయతీలకు ఒకే ఒక్క సీహెచ్‌సీ ఉంది. ఇక్కడ వైద్యులు ప్రతి ఆదివారమూ సరిగా ఉండకపోవడంతో రోగుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆదివారం ఆస్పత్రికి రాని వైద్యులు, సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



ఆరోగ్యకేంద్రం వద్ద వైద్యుల కోసం వేచిచూస్తున్న తల్లి, బాలిక

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



కదిరిలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో సిద్ధం చేసిన బెంచీలు

కదిరిఅర్బన్, మార్చి 17: పదో తరగతి పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే పరీక్షలు ఈ నెల 30వ తేదీ వరకు జరగనున్నాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు జరగనున్నాయి. పట్టణం, రూరల్‌లో 11 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల, జూనియర్ కళాశాల, జిల్లాపరిషత్ బాలికల ఉన్నతపాఠశాల, జూనియర్ కళాశాల, కుటాగుళ్ల, వీవర్సుకాలనీ మున్సిపల్ పాఠశాల, ఉర్దూ మెయిన్ స్కూల్, కేజీబీవీ, పట్నం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల, కుమ్మరవాండ్లపల్లి జిల్లాపరిషత్ పాఠశాల, కాళసముద్ర గురుకుల పాఠశాలను కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. వాటిల్లో సుమారు 2,380మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షల నిర్వాహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ చెన్నకృష్ణ తెలిపారు.

ఓబుళదేవరచెరువు: నేటినుంచి పది పరీక్షలకు ప్రారంభం కానున్నాయి. ఇందుకు పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓలు సురేష్‌బాబు, రమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలకేంద్రంలోని జిల్లాపరిషత్, శ్రీవిజ్ఞాన్, విజ్ఞాన్, జీవన జ్యోతి పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. నాలుగు కేంద్రాల్లోను 11వందల మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. 724 మంది రెగ్యులర్, 376మంది సప్లమెంటరీ పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు.

ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలి: ఆర్డీఓ



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి

ధర్మవరం రూరల్, మార్చి17: ఎన్నికలలో పాల్గొనే అధికారులందరూ తప్పనిసరిగా ఎన్నికల నిబంధనలను పాటించాలని ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆదివారం ఆయన ఎన్నికల విధుల్లో పాల్గొనే వివిధ అధికారులతో సమావేశమై మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని, అధికారులు తమ విధులను కొనసాగించాలని సూచించారు. వాహనాలను తనిఖీలు చేస్తూ.. నగదు పట్టుబడితే సంబంధిత అధికారులకు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. ఎన్నికల విషయంలో ఫిర్యాదులను కాల్‌సెంటర్ 1950కు కాల్‌చేసి ప్రజలు ఫిర్యాదు చేయవచ్చుని, వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కారించేలా కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. అదేవిధంగా యాప్‌సవిధా, సీ.విజిల్ యాప్‌లను కూడా ఉపయోగించుకుని ఫిర్యాదులను స్వీకరించి పరిష్కారించాలన్నారు. సమావేశంలో ఏఓ రమేష్ బాబు, ఎన్నికల ఉపతహసీల్దార్ షణ్ముఖయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన అధ్యాపకులను రెగ్యులర్ చేయాలి

ధర్మవరం, మార్చి 17: రాష్ట్రంలో అర్హత కలిగిన అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని ఒప్పంద అధ్యాపకుల సంఘం జేఏసీ నాయకులు పెద్దన్న, భాస్కర్‌రెడ్డి, అక్బర్‌బాషా , శంకర్‌నాయక్, చంద్రకళ, సరితప్రభుత్వాన్ని ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. యాక్ట్ 30 ప్రకారం 2000 సంవత్సరం నుంచి 2012 వరకు అర్హత ఉన్న వాళ్ల అందరినీ వెంటనే క్రమబద్ధీకరించి ఉత్తర్వులు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్‌పై ఫిర్యాదు

కదిరి, మార్చి 17 : వైసీపీ సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ మెగా అంజాద్‌పై ఎన్నికల కమిషన్‌కు కదిరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆదివారం ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. మెగా అంజాద్ తనకు తాను గాయపరచుకుని తెలుగు దేశం పార్టీ వారు దాడి చేసి గాయపరచినట్లు ప్రచారం చేస్తానని కదిరి పట్టణంలో తెలుగు దేశం కార్యకర్తలకు, ప్రజలకు చెబుతున్నట్లు ఫిర్యాదు చేశారు. ఇటువంటి తప్పుడు ప్రచారాలను చేస్తున్న వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ మెగా అంజాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశారని. ఎటువంటి చర్యలు చేపట్టలేదని సమాచారం. పోలీసులు ఇటువంటి వాటిని మొదట్లోనే అణిచివేయకపోతే శాంతి, భద్రతలకు విఘాతం కలిగే ప్రమాదం ఉందని పలువురు పేర్కొన్నారు.

లేపాక్షి శిల్పకళ అమోఘం

- కర్నూలు బెటాలియన్ రేంజ్-3 డీఐజీ



నంది విగ్రహం వద్ద డీఐజీ వెంకటేశ్వర్లు కుటుంబం

లేపాక్షి, మార్చి 17 : ప్రసిద్ధ పర్యాటక కేంద్రమైన లేపాక్షిలోని దుర్గా, వీరభద్రస్వామి ఆలయంలో శిల్పకళ లు అద్భుతంగా ఉన్నాయని కర్నూలు బెటాలియన్ రేంజ్-3 డీఐజీ వెంకటేశ్వర్లు అన్నారు. ఆయన ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ అర్చకులు ఆలయ విశిష్టతను వివరించారు. వారు ఆలయంలోని ఏడు శిరస్సుల నాగేంద్రుడు, అర్థాంతరంగా ఆగిన కల్యాణమండపం, సీతాదేవి పాదం, వేలాడే స్తంభాన్ని సందర్శించారు. అనంతరం దుర్గా, వీరభద్రస్వాములకు ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ సిబ్బంది దుశ్శాలువతో సన్మానించారు. ఏకశిలా నంది విగ్రహాన్ని సందర్శించిన అనంతరం డీఐజీ మాట్లాడుతూ... ఆలయంలో శిల్పాలు, చిత్రకళలు అద్భుతం గా ఉన్నాయన్నారు. ఆనాటి శిల్పుల నైపుణ్యాన్ని కొనియా డారు. ఆలయాన్ని సందర్శించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆయన వెంట స్థానిక పోలీసులు ఉన్నారు.

దుమ్మూధూళితో దెబ్బతిన్న కర్బూజా

- పెట్టుబడి కూడా రాలేదని రైతు ఆవేదన

నంబులపూలకుంట, మార్చి 17: మండలంలోని ఎర్రవంకలవారిపల్లికి చెందిన రెడ్డెప్పరెడ్డి సాగుచేసిన కర్బూజా పంట దుమ్మూధూళితో పూర్తిగా నాశనమైంది. దీంతో తీవ్రంగా నష్టపోయామని బాధిత రైతు ఆవేదన చెందుతున్నారు. తనకున్న మూడెకరాల పొలంలో కర్బూజా పంటను సాగుచేశానని, గత జనవరిలో పొలంలో కర్బూజా విత్తనాలు నాటానని, ఫిబ్రవరిలో పంట పూత దశకు వచ్చిందని, ఆ సమయంలో వేంపల్లి రోడ్డు పనులు జరుగుతున్నాయని, రోడ్డు పక్కనే తన పొలం ఉండడం వల్ల కంకర, డస్టుతో పాటు వాహనాల రాకపోకలతో దుమ్మూధూళి అధికమై పంటపైన పడుతోందని, దీంతో పూత నిలవకుండా రాలిపోయిందని వాపోతున్నారు. దుమ్మూధూళి నుంచి పంటను కాపాడుకోవడానికి 110 చీరలు కొనుగోలు చేసి పొలం చుట్టూ అడ్డుగా కట్టినా.. ఉపయోగం లేకుండా పోయిందంటున్నారు. ప్రస్తుతం అరకొరగా కాసిన కాయలకు మార్కెట్‌లో ధరలు లేకుండా పోయాయని ఆవేదన చెందుతున్నారు. పంటకు పెట్టిన పెట్టుబడి రూ.మూడు లక్షలు నష్టపోవాల్సి వస్తోందంటున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరుతున్నారు.



దుమ్మూధూళి నిండుకోవడంతో దిగుబడి లేని పంట

లేపాక్షి శిల్పకళ అమోఘం

కర్నూలు బెటాలియన్ రేంజ్-3 డీఐజీ



నంది విగ్రహం వద్ద డీఐజీ వెంకటేశ్వర్లు కుటుంబసభ్యులు

లేపాక్షి, మార్చి 17 : ప్రసిద్ధ పర్యాటక కేంద్రమైన లేపాక్షిలోని దుర్గా, వీరభద్రస్వామి ఆలయంలో శిల్పకళలు అద్భుతంగా ఉన్నాయని కర్నూలు బెటాలియన్ రేంజ్ - 3 డీఐజీ వెంకటేశ్వర్లు అన్నారు. ఆయన ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ అర్చకులు ఆలయ విశిష్టతను వివరించారు. వారు ఆలయంలోని ఏడు శిరస్సుల నాగేంద్రుడు, అర్ధాంతరంగా ఆగిన కల్యాణమండపం, సీతాదేవి పాదం, వేలాడే స్థంభాన్ని సందర్శించారు. అనంతరం దుర్గా, వీరభద్రస్వాములకు ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ సిబ్బంది దుశ్శాలువతో సన్మానించారు. ఏకశిలా నంది విగ్రహాన్ని సందర్శించిన అనంతరం డీఐజీ మాట్లాడుతూ... ఆలయంలో శిల్పాలు, చిత్రకళలు అద్భుతంగా ఉన్నాయన్నారు. ఆయన వెంట స్థానిక పోలీసులు ఉన్నారు.

రొళ్ల ఎస్ఐగా రాజశేఖర్

రొళ్ల, మార్చి 17: స్థానిక ఎస్ఐగా రాజశేఖర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న మధు రామచంద్రుడిని పుట్టపర్తి ఎస్పీ కార్యాలయానికి మార్చారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నగారా మోగిన నేపథ్యంలో ఎన్నికల నియమావళిని ప్రతిఒక్కరు తప్పక పాటించాలని సూచించారు.

స్టార్టర్ పెట్టె కాల్చివేత



కొత్తూరులో కాలిపోయిన స్టార్టర్ పెట్టె

రొద్దం, మార్చి 17 : మండలంలోని ఆర్ఎల్ కొత్తూరులో వడ్డె సంజీవప్ప అనే రైతుకు చెందిన స్టార్టర్ పెట్టెను శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కాల్చివేశారు. ఆర్ఎల్ కొత్తూరుకు చెందిన వడ్డె సంజీవప్ప కుమారుడు అనీల్‌కుమార్ ఇటీవల మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని ప్రేమించి, వేరే ఊరిలో పెళ్లి చేసుకున్నాడు. ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేసి యువతిని తిరిగి ఇంటికి రప్పించారు. అయితే అప్పటి నుంచి తనపై కక్షగట్టిన అమ్మాయి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు శనివారం తమ గ్రామానికి వచ్చి బెదిరింపులకు గురిచేసినట్లు రైతు సంజీవప్ప వాపోయాడు. తమ వ్యవసాయ బోరుకు చెందిన స్టార్టర్ పెట్టెను కాల్చివేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. అయితే ఈ విషయంపై వైసీపీ నాయకుడిని వివరణ కోరగా తనకు ఎలాంటి సంబంధం లేదన్నాడు. అనీల్‌పై పోక్సోచట్టం కింద కేసు ఉండటంతో తనపై ఆరోపిస్తున్నట్లు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పెనుకొండ, మార్చి 17: మండలంలోని పాలసముద్రం సమీపంలో మిషన్‌తండా వద్ద జాతీయ రహదారిపై సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కర్ణాటక నుంచి ఆంధ్రకు తరలిస్తున్న 864టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. రహదారిపై ఆదివారం ఉదయం వాహనాలను తనిఖీ చేస్తుండగా ఐషర్ వాహనంలోని మద్యాన్ని స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ని అరెస్ట్ చేశామన్నారు. వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సెబ్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుపై దాడి

రొద్దం, మార్చి 17: మండలంలోని ఆర్ మరువపల్లిలోని నారాయణరెడ్డి అనే రైతుకు చెందిన జామతోటలోకి నలుగురు పిల్లలు రోజూ వచ్చి జామ, మామిడి కాయలు తీసుకెళ్తున్నారని ఆ రైతు అంటున్నాడు. ఈ విషయంపై ఆదివారం గొడవ జరిగింది. ఆదివారం ఉదయం రొద్దం మండలం ఆర్ మరువపల్లికి చెందిన నలుగు పిల్లలు అదే గ్రామానికి చెందిన రైతు నారాయణరెడ్డి తోటలో జామ, మామిడి కాయలు కోసుకుని తీసుకెళ్తూ రైతుకు పట్టుపడ్డారు. రెండు నెలలుగా తోటలో ఇలా పండ్లు పోతున్నాయనే కోపంతో రైతు ఆ పిల్లలను మందలించి పంపించేశాడు. అయితే తమ పిల్లలపై దాడి చేశాడని దొడఘట్ట వాసులు 20 మంది ఆదివారం సాయంత్రం రైతు నారాయణరెడ్డి ఇంటి వద్దకు వెళ్లి దాడి చేశారు. దీనిపై ఇరు వర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు

వాహనం బోల్తా



వాహనం బోల్తాపడి రోడ్డుపై చెల్లా చెదురుగా పడిఉన్న కళింగరకాయలు

పెనుకొండ టౌన్, మార్చి 17 : పట్టణ సమీపంలోని 44వ జాతీయ రహదారి పులేకమ్మ గుడివద్ద ఆదివారం డివైడర్‌ను ఢీకొని కళింగర కాయలతో వెళ్తున్న టెంపో వాహనం బోల్తాపడింది. కర్ణాటక నుంచి అనంతపురం వైపు వెళ్తున్న కళింగరకాయల లోడుతో వెళ్తున్న టెంపో వాహనం అదుపుతప్పి బోల్తాపడడంతో కాయలన్నీ రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదని పోలీసులు తెలిపారు.

వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్‌పై ఫిర్యాదు

కదిరి, మార్చి 17 : వైసీపీ సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ మెగా అంజాద్‌పై ఎన్నికల కమిషన్‌కు కదిరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆదివారం ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. మెగా అంజాద్ తనకు తాను గాయపరచుకుని టీడీపీ వారు దాడి చేసి గాయపరచినట్లు ప్రచారం చేస్తానని కదిరి పట్టణంలో టీడీపీ కార్యకర్తలకు, ప్రజలకు చెబుతున్నట్లు ఫిర్యాదు చేశారు. ఇటువంటి తప్పుడు ప్రచారాలను చేస్తున్న వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ మెగా అంజాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం



పెనుకొండలోని పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంఈఓ చంద్రశేఖర్

పెనుకొండ, మార్చి 17 : డివిజన్‌లోని పరీక్షా కేంద్రాలలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదోతరగతి పరీక్షలను రాసే విద్యార్థుల కోసం అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు డీవైఈఓ రంగస్వామి తెలిపారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ.... డివిజన్‌లోని పెనుకొండ, హిందూపురం, మడకశిర, పుట్టపర్తి నియోజకవర్గాలలో 63పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, మొత్తం 15,418 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు అవసరమైన బల్లలు, విద్యుత్ దీపాలు, ఫ్యాన్‌లు, మంచినీటి వసతి ఏర్పాటు చేశామన్నారు. ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. డివిజన్ వ్యాప్తంగా మొత్తం 63మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 63మంది చీఫ్ సూపరింటెండెంట్లు, ఒక అదనపు డిపార్ట్‌మెంటల్ అధికారిని నియమించినట్లు తెలిపారు. వీరితోపాటు 1890మంది ఇన్విజిలేటర్లను ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.45వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు గంట మునుపే పరీక్షా కేంద్రానికి చేరుకుని వారి నంబర్లు, గదులను చూసుకోవా లన్నారు. ఆలస్యమైతే పరీక్ష హాలులోకి అనుమతించమన్నారు. పెనుకొండలో ని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఒక కేంద్రాన్ని, బాలికల ఉన్నత పాఠశాల లో రెండు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 740మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. పెనుకొండలోని పరీక్షా కేంద్రాలను ఎంఈఓ చంద్రశేఖర్ ఆదివారం పరిశీలించారు.

హిందూపురం అర్బన్: పదో తరగతి పరీక్షల కోసం పట్టణంలోని కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్టు విద్యాశాఖాధికారులు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పరీక్షా గదుల్లో ఫ్యాన్లు, లైట్లు, గాలి వెలుతురు ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నట్లు ఎంఈఓ గంగప్ప తెలిపారు. పట్టణ వ్యాప్తంగా 15 పరీక్షా కేంద్రాలలో 3987 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపా రు. రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. ఇన్‌విజిలేటర్లకు కూడా పరీక్షా కేంద్రాల్లోకి సెల్ ఫోన్ అనుమ తి లేదన్నారు.

మడకశిర టౌన్ : పట్టణం, మండలంలోని పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేసినట్టు విద్యాశాఖ అధికారులు తెలిపారు. మొత్తం 1550 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. మడకశిర పట్టణం, మండలంలో ఏడు పరీక్షా కేం ద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ శ్రీనివాస్‌బాస్కర్ తెలిపారు. పట్టణం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 250 మంది విద్యార్థులు, జడ్పీ బాలికోన్నత పాఠశాలలో 200 మంది, సిద్దార్థ ఇంగ్లీస్ మీడియం పాఠశాలలో 200 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 250 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. అలాగే కదిరేపల్లిలోని సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాలలో ఏ- కేంద్రంలో 200 మంది, బీ - కేంద్రంలో 200 మంది, మొట్టమెదటిసారిగా ఆమిదాలగొంది ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 250 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఆయన తెలిపారు. పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించడానికి సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌ను నియమించినట్లు ఎంఈఓ తెలిపారు.

పరీక్షల నిర్వహణపై అవగాహన

రొళ్ల: మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ , కేజీబీవీపీల్లోని పదోతరగతి పరీక్షా కేంద్రాల్లో పరీక్ష నిర్వహణపై ఎంఈఓ శ్రీధర్ సూచనలు, సలహాలు అందించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులతో సమావేశమయ్యారు. మాస్‌కాపీయింగ్ లేకుండా చూడాలని, పరీక్షలు ప్రశాంతంగా రాసేలా ఇన్విజిలేటర్లు పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీధర్, సునీత, తిమ్మప్ప పాల్గొన్నారు.

జైలుకెళ్లడానికే జగన్ సిద్ధం

టీడీపీ హయాంలోనే పల్లెల్లో అభివృద్ధి: సవిత



అడదాకులపల్లిలో మాట్లాడుతున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత

పెనుకొండ రూరల్, మార్చి 17 : సిద్ధం... సిద్ధం... అంటున్న సీఎం జగన్ జైలుకు వెళ్లడానికే సిద్ధమంటున్నాడని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత విమర్శించారు. తెలుగుదేశం పార్టీ హయాంలోనే పల్లెలు అభివృద్ధి చెందాయన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె ఆదివారం మండలంలోని అడదాకులపల్లి, మావటూరుల్లో టీడీపీ, జనసేన నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సవితకు గ్రామస్థులు, మహిళలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీ హయాంలోనే అడదాకులపలికి కోట్లాదిరూపాయలు వెచ్చించి సీసీరోడ్లు వేశామన్నారు. తమ తండ్రి ఎస్ రామచంద్రారెడ్డి హయాంలో పలువురు పేదలకు ఇళ్లు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుతం అడదాకులపల్లి, మావటూరు గ్రామాల నుంచి వందలాది మంది యువకులు కియ పరిశ్రమలో ఉపాధి పొందుతున్నారన్నారు. చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడని, ఆయన ముఖ్యమంత్రిగా ఉంటే కియ లాంటి పరిశ్రమలు మరెన్నో వస్తాయన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేయన్ను సూపర్‌సిక్స్ పథకాలతో ప్రతి కుటుంబం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. ఒక్క చాన్స్ అని అడిగిన జగన్‌కు అధికారం ఇస్తే రాష్ట్రం సర్వ నాశనమైందన్నారు. ఎన్నికల్లో బెదిరించాలని చూస్తే గట్టిగా గుణపాఠం చెప్పాలన్నారు. పెనుకొండను దోచుకెళ్లడానికి ఒక వలసపక్షి వచ్చిందని ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. తాను లోకల్ అని ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. మీ పిల్లల భవిష్యత్తు కోసం టీడీపీని ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా అడదాకులపల్లికి చెందిన వైసీపీ నాయకులు గోపి, నంజప్ప, కురుబ వెంకటేశ్, శివనాయక్, నారాయణ, బీమ్లా నాయక్, హనుమంతనాయక్, రాజేష్‌నాయక్ తదితరులు టీడీపీలో చేరారు. మావటూరులో 50కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ లోకి చేరాయి. వారికి సవిత కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ డీలర్ కిష్టప్ప, చెరువు ఆయకట్టు అధ్యక్షుడు సంజీవప్ప, హనుమంతు, కొల్లప్పగారి కుటుంబం, ఎగువింటిగారి కుటుంబం తదితరులు ఉన్నారు. వారికి సవిత కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ పాలనతో విసుగుచెంది టీడీపీలో చేరినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్ర మంలో మాజీ జడ్పీటీసీ నారాయణస్వామి, జిల్లా అధికార ప్రతినిధి రఘువీర చౌదరి, నాయకులు ఈశ్వరప్రసాద్, రంగనాయకులు మావటూరుగోపాల్, బాలాజీనాయక్, కుప్పేనాయక్, హజురుల్లాఖాన్, గుట్టూరు సూరీ, పోతిరెడ్డి, రామలింగ, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, జనసేన సమన్వయకర్త ఈడిగ కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన అంతం

టీడీపీ అభ్యర్థి సునీల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే ఈరన్న



టపాసులు పేల్చి సంబరాలు చేసుకుంటున్న తెలుగుతమ్ముళ్లు

మడకశిరటౌన్, మార్చి 17: ఎన్నికల నియమావళి అమలులోకి రావడంతో రాష్ట్రంలో అరాచక పాలన ముగిసిందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న అన్నారు. సైకో జగన్ పాలన పూర్తి స్థాయిలో ముగిసి పోయిందని, భవిషత్తులో జగన్ మరోసారి ముఖ్యమంత్రి కాలేడన్నారు. ఎన్నికల నియమావళి అమలులోకి రావడంతో రాక్షస పాలనకు వీడ్కోలు చెబుతూ వారు శనివారం రాత్రి టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి టపాసులు పేల్చి సంబరాలు జరుపుకొన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం రాబోతోందని విశ్వాసం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరిస్తారని, అప్పుడే రాష్ట్రానికి భవిష్యత్తు అన్నారు. జగన్ తన ఐదేళ్ల విధ్వంసక పాలనలో రాష్ట్రాన్ని అన్ని విధాలా నాశనం చేశారని మండిపడ్డారు. సొంత చెల్లెలే తన అన్నకు ఓటు వేయవద్దని చెప్పడం జగన్ సైకో పాలనకు నిదర్శనం అన్నారు. జగన్‌ను తాడేపల్లి ప్యాలెస్ నుంచి తరిమికొడదామని పిలుపు నిచ్చారు.

టీడీపీలోకి చేరిక: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం మడకశిర మండల పరిధిలోని అచ్చంపల్లి, మరువపల్లి గ్రామాల నుంచి దాదాపు 10 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరాయి. వైసీపీకి చెందిన లక్ష్మీనాయక్, కోటినాయక్, రాజునాయక్, శ్రీరామ్‌ నాయక్, యల్లప్ప తదితరులు టీడీపీలో చేరారు. వారికి మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న టీడీపీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా రాష్ట్ర వక్కలిగ సాధికార కన్వీనర్ వీఎం పాండురంగప్ప, మాజీ ఎంపీపీ బొజ్జప్ప, మండల మాజీ కన్వీనర్ రామాంజనేయులు, మున్సిపల్ మాజీ చైర్మన్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

దోచుకునేందుకే వలసపక్షులు : టీడీపీ



సూపర్‌సిక్స్‌పథకాలపై ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

పెనుకొండ టౌన్ (సోమందేపల్లి), మార్చి 17 : నియోజకవర్గంలో దోచుకోవడానికే స్థానికేతరులు వలసపక్షుల్లా వస్తున్నారని టీడీపీ నాయకులు విమర్శించారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత భర్త వెంకటేశ్వరరావు తదితరులు శనివారం సోమందేపల్లి మండలంలోని పలు పంచాయతీల్లో ఆ పార్టీ సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. అధికార పార్టీ వైసీపీ ఈ ఐదేళ్లలో ఎలాంటి అభివృద్ధి చేయలేదని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ అధికారంలో ఉన్నప్పుడు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కరువు నివారణ, ఉద్యోగ, ఉపాధి, వకాశాలు కల్పించేందుకు ఎంతో కృషి చేశారన్నారు. వైసీపీ స్థానికేతర అభ్యర్థుల్లో ఒకరు గత ఐదేళ్లుగా దోచుకుని వెళ్లారని, మరొకరు ఇక్కడ ల్యాండింగ్ అయ్యారని విమర్శించారు. ఏది ఏమైనా స్థానికంగా ఉన్న అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మండల మాజీ కన్వీనర్ శ్రీరాములు, మాజీ వైస్ సర్పంచ్ సుబ్రహ్మణ్యం, పూల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వీల్‌చైర్ల పంపిణీ

పావగడ, మార్చి 17: స్వామి వివేకానంద దివ్యాంగుల సంఘం, దక్షిణ సంక్షేమ ప్రాంత పునరావసతి కేంద్రం ఆధ్వర్యంలో 45 మంది దివ్యాంగులకు ఆదివారం వీల్ చైర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర దివ్యాంగుల సంఘం కన్వీనర్ సుధీంద్ర హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ... ప్రతి గ్రామ పంచాయతీకి దివ్యాంగుల సంక్షేమం కోసం ఐదు శాతం నిధులను కేటాయించాలని డిమాడ్‌చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యేలు, ఎంపీలు కృషి చేయాలని కోరారు. ఈసందర్భంగా బెంగళూరుకు చెందిన ఏపీడీ సంస్థ కన్వీనర్ శాంతకుమార్, ఎంఆర్‌డబ్ల్యూ మైలారప్ప, ఆదిలక్ష్మి, రత్నమ్మ, రమేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

మడకశిర రూరల్, మార్చి 17: ఉద్యాన పాలిటెక్నికల్ కళాశాల అధ్వర్యంలో కళాశాల దత్తతగ్రామం గంగుళవాయిపాళ్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమణ తెలిపారు. డాక్టర్ రవిశంకర్ 60 మందికి రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీచేశారు. అనంతరం ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గ్రామంలో ఇంటింటికి వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

నీరు వదిలితేనే... దారి వదులుతాం

- రోడ్డుపై బైఠాయించి శ్రీకంఠపురం వాసుల నిరసన
- జేసీ హామీతో విరమణ



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న శ్రీకంఠపురం వాసులు

హిందూపురం అర్బన్, మార్చి 17: నీరు వదిలితేనే తాము దారి వదులుతామని శ్రీకంఠపురం వాసులు భీష్మించారు. శ్రీకంఠపురం సర్కిల్‌లోని మహిళలు, ఆ ప్రాంత వాసులు ఆదివారం ఖాళీ బిందెలతో పట్టణంలోని హిందూపురం - లేపాక్షి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తమ ప్రాంతంలో పది రోజులుగా నీరు సక్రమంగా రావడంలేదన్నారు. మోటార్లు సరిగా పనిచేయడంలేదని వాటర్‌మెన్ చెబుతున్నాడన్నారు. అంతే గాకుండా ట్యాంకర్లను ఏర్పాటు చేస్తాం... వీలైతే పట్టుకోండి లేకుంటే మీకు దిక్కున్న చోట చెప్పుకోండని హేళనగా మాట్లాడుతున్నాడని ఆగ్రహించారు. కూలినాలి చేసుకుని జీవించే తమకు నీటిని కొనేస్థోమత లేదన్నారు. అలాగే బిందెలు మోయలేని వారిని దృష్టిలో ఉంచుకుని కొళాయి ద్వారానే నీటిని వదలాలని కోరామన్నారు. వారు రోడ్డుపై అర గంట బైఠాయించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఇదే సమయంలో హిందూపురం నుంచి లేపాక్షి వైపు వెళ్తున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ రోడ్డుకు అడ్డంగా కూర్చున్న మహిళల వద్దకు వచ్చి విచారించారు. ఈ రోజే మీకు నీరు అందేలా చేస్తానని హామీ ఇవ్వడంతో శ్రీకంఠపురం వాసులు నిరసన విరమించారు. వెంటనే మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి అక్కడకు చేరుకున్నారు. విషయం తెలుసుకొని వాటర్ ఫిట్టర్, వాటర్‌మన్‌ను పిలిపించి మందలించారు. వాటర్ మన్‌ను వేరే ప్రాంతానికి మార్చాలని ఏఈని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు లింగప్ప, డ్రైస్ వెంకటేష్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న జేసీ అభిషేక్ కుమార్

కోడ్ కూసింది.. ముసుగు పడింది





పురంలో ఫ్లెక్సీలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది, ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు

హిందూపురం/పెనుకొండ/గోరంట్ల, మార్చి 17: ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో హిందూపురం పట్టణం, మండలాల పరిధిలో అధికార యంత్రాంగ అప్రమత్తమైంది. హిందూపురం పట్టణంలోని నెహ్రూ, రాజీవ్ గాంధీ, ఇందిరమ్మ, ఎన్టీఆర్, వైఎస్ఆర్ విగ్రహాలకు ముసుగు తొడిగారు. అదేవిధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచార హోర్డింగులు, రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను తొలగించేపనులు చేపట్టారు. పట్టణంలోని ప్రధాన కూడలిలో ఆదివారం ఉద యం నుంచి ఫ్లెక్సీలను తొలగించే పనుల్లో మున్సిపల్ యంత్రాంగం నిమగ్న మైంది. ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రభుత్వ స్థలాల్లో ఉన్న ఫ్లెక్సీలు, హోర్డింగులను సైతం తొలగించారు. అలాగే పెనుకొండలో మునిసిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ ఆధ్వర్యంలో సిబ్బంది ఈ కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో కోడ్ అమలు చేస్తున్న తీరును పెనుకొండ సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్ గోరంట్లలో ఆదివారం పరిశీలించారు. మధ్యాహ్నం 3గంటల సమయంలో గుమ్మయ్యగారిపల్లి కూడలి నుంచి గోరంట్ల మీదుగా కదిరి రహదారిలోని కసిరెడ్డిపల్లి వరకు ఆయన పరిశీలించారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా పనిచేయాలని అధికారులకు సూచించారు. ఆయనతో పాటు తహసీల్దార్ అక్బల్‌బాషా, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ తదితరులున్నారు. పంచాయతీ రాజ్ ఈఓ బాబురావు ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది పట్టణంలో ఉదయం నుంచి వివిధ పార్టీల జెండాలు, స్వాగత తోరణాలు, ఫ్లెక్సీలు, పోస్టర్లను తొలగించారు. బస్టాండ్ కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహం, గుమ్మయ్యగారిపల్లి కూడలి లోని వైఎస్ఆర్ విగ్రహాలకు ముసుగులు వేశారు.సాయంత్రానికి 90శాతం తొలగించామని, మిగిలినవాటిని సోమవారం తొలగిస్తామని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.





పెనుకొండలో రోడ్డుపక్కన మంత్రి ఉషశ్రీ కటౌట్‌ను తొలగిస్తున్న మునిసిపల్ సిబ్బంది, గోరంట్ల బస్టాండ్ కూడలిలో భారీ కటౌట్‌ను తొలగిస్తున్న దృశ్యం

ఎన్నికల కోడ్ అమలులో నిర్లక్ష్యం వద్దు: జేసీ

చిలమత్తూరు, మార్చి 17: ఎన్నికల కోడ్ అమలులో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఆయన ఆదివారం మండలంలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలను, ప్రభుత్వాసుపత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేసీ అన్ని కార్యాలయాల్లోకి వెళ్లి ఎక్కడైనా రాజకీయ పార్టీల నాయకుల ఫొటోలు, చిత్రాలు ఉన్నాయా? అని ఆరాతీశారు. ఉంటే వాటిని వెంటనే తొలగించాలన్నారు. కోడ్ అమల్లోకి రావడంతో ఎక్కడ కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి రాజకీయ నాయకుల ఫోటోలు ఉంటే వాటిపై స్టిక్కరింగ్ వేయాలన్నారు. ఎక్కడా కోడ్ ఉల్లంఘన జరగరాదన్నారు. అధికారులందురూ ఎన్నికలు ముగిసే వరకు అందుబాటులో ఉండాలన్నారు. సెలవు రోజుల్లో సైతం ప్రభుత్వ కార్యాలయాలు తెరవాలన్నారు. ఎక్కడైనా రాజకీయ పార్టీల హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు ఉంటే వెంటనే తొలగించండని ఆదేశాలు ఇచ్చారు. కోడ్‌కు విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా చర్యలు తీసుకుంటమని హెచ్చరించారు.

ఎన్నికల నిబంధనలను తప్పక పాటించాలి : ఎస్ఐ

అగళి : ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, అలా పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వీరేష్ హెచ్చరించారు. ఆయన శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అగళి మండలం కర్ణాటక సరిహద్దులో ఉన్నందున మద్యం, నగదు అక్రమ రవాణాకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకో నున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎవరి వద్దనైనా రూ.50వేలకు మించి నగదు ఉండకూ దదన్నారు. అధికంగా ఉంటే దానికి సంబంధించిన వివ రాలను చూపించాలని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయంలో ప్రజా ప్రతినిధుల ఫొటోలు ఉండకూడదన్నారు. ఎన్నికలు అయిపోయేంతవరకు వాటికి మూసివేయాలన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

చందాకోసం వెళితే వైసీపీ కండువా వేశారు

పలువురు వడ్డెర కులస్థుల ఆగ్రహం



సవిత సమక్షంలో టీడీపీ కండువా వేసుకున్న వడ్డెర్లు

పెనుకొండ టౌన్, మార్చి 17: వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికని చందాకోసం వెళితే మంత్రి ఉష తమకు వైసీపీ కండువా వేశారని పరిగి మండలానికి చెందిన పలువురు వడ్డెర్లు పేర్కొన్నారు. వారు ఆదివారం పెనుకొండలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవితకు జరిగిన సంఘటనను వివరించారు. అనంతరం టీడీపీ కండువాలు వేసుకొని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వడ్డెర కులస్థులు మాట్లాడుతూ పరిగిలో శనివారం జరిగిన సమావేశంలో మంత్రి వద్దకు ఆలయ అభివృద్ధి కోసం చందా అడగటానికి వెళ్లామన్నారు. అయితే సమస్యను పక్కన పెట్టి ఆమె తమకు వైసీపీ కందు వాలు వేశారన్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే మళ్లీ మాట్లాడుదామని చెప్పారన్నారు. వైసీపీ కండువ వేసుకోవడం తమకు నచ్చదని టీడీపీ కండువా వేసుకునేందుకే పెనుకొండ పార్టీ కార్యలయానికి వచ్చామ న్నారు. కార్యక్రమంలో వడ్డెర సాధికార సమితి రాష్ట్ర డైరెక్టర్, హనుమయ్య వడ్డె వెంకటలక్ష్మమ్మ, గంగరత్నమ్మ పాల్గొన్నారు.

నామమాత్రంగా ఎన్నికల నియమావళి అమలు



అమరాపురం బస్టాండు ఆవరణలో వైర్లపై దర్శనమిస్తున్న వైసీపీ గుర్తు

మడకశిరటౌన్, మార్చి 17: సార్వత్రిక ఎన్నికల నగారా మోగడంతో ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచుట ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ స్థలాల్లో రాజకీయ ప్రకటలతో ఉన్న హోర్డింగ్‌లు, పోస్టర్లు, కటౌటర్లను తొలగించాలని ఎన్నికల కమిషన్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. అయినా వైసీపీకి చెందిన గుర్తులతో అమరాపురం బస్టాండు ఆవరణంలో వైసీపీ ఎన్నికల గుర్తు అయిన ఫ్యాన్‌ను వైర్లకు వేలాడ దీశారు. సాయంత్రం 6 గంటలైనా దానిని తొలగించలలేదు. అక్కడక్కడ స్తంభాలపైన సైతం స్టిక్కర్లు దర్శనమిచ్చాయి.